



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

భూదాన్ బాధితులకు న్యాయం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతులు, నాయకులు

నందిగామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): భూదాన్ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. నందిగామ రైతులకు 1975లో 18 మంది నిరుపేద రైతులకు 99 ఎకరాల భూమిని భూదాన్ బోర్డు పట్టాలు అందజేసింది. ఆ భూమికి కొందరు తప్పుడు ఓఆర్‌సీలు సృష్టించి కబ్జా చేశారని కొన్ని రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. గురువారం బాధిత రైతులకు న్యాయం చేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు సీపీఐ నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పానుగంటి పర్వతాలు, గడ్డం జంగయ్య, బాధిత రైతులు అల్వాల వెంకటయ్య, కావలి శ్రీనివాస్, తుప్పుడు పోచమ్మ, జంగయ్య, పోచయ్య తదితరులున్నారు.



లక్ష్మీనర్సింహారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్

గ్రీన్ ఇండియా చాలెంజ్ ఇన్‌చార్జిగా గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా చాలెంజ్ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కడ్తాల మండల కేంద్రంలో ఆయనను మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణ ఉన్నారు.

సమతా కుంభ్ బ్రహ్మోత్సవాల్లో

ఎమ్మెల్యే హరీశ్ పూజలు

- ఆశీస్సులు అందించిన చిన జీయర్‌స్వామి



హరీశ్‌రావుకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతా కుంభ్ బ్రహ్మోత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయన చేతికి కంకణం కట్టారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనకు స్వామీజీ పూలమాల వేసి ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం 18 దివ్య దేశాల్లో చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, మంగళ శాసనములు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్ స్వామి, మైహోంగ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బిల్లులు చెల్లించాలని కడ్తాలలో జాతీయ రహదారిపై పాలు పారబోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

- జిల్లాలో రూ.20 కోట్లు బకాయిలు
- నలభై ఐదు రోజులుగా పెండింగ్‌లోనే..
- లీటర్ పాలకు రూ.4 ప్రోత్సాహకం కరువు
- పోషణ భారమై పశువుల విక్రయం

ఆపసోపాలు!

పాల బిల్లుల కోసం పాడి రైతుల ఎదురుచూపు

పాడి రైతుకు పాల బిల్లులు సకాలంలో అందక ఆపసోపాలు పడుతున్నారు. జిల్లాలో కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పదిహేను రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు రెండున్నర నెలలవుతున్నా ఒక్క రూపాయి చెల్లించకపోవడంపై మండిపడుతున్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. పాడిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైతే పాల ఉత్పత్తి చేసేదెలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్/ఆమనగల్లు/చౌదరిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య (విజయ డెయిరీ)కు పాలను విక్రయిస్తున్న రైతులకు సకాలంలో చెల్లింపులు జరగక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ 15 రోజులకోసారి బిల్లులు ఇవ్వాల్సి ఉండగా.. గత 45 రోజులుగా అవి నిలిచిపోయాయి. దీంతో పాటు లీటరుపై రూ. 4 చొప్పున ప్రభుత్వం ఇస్తున్న అదనపు ప్రోత్సాహకం కూడా అందటం లేదు. దీనికోసం మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. అలాగే ప్రమాదవశాత్తు గేదె మృతి చెందితే బీమా సౌకర్యానికి నోచుకోవడం లేదు. బ్యాంకర్ల నుంచి రుణ సౌకర్యం విషయంలోనూ మద్దతు కరువైందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడి రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. ఆర్థిక చేయూతను అందించేందుకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా

మిగతా 8వ పేజీలో...

పాల బిల్లు రూ. లక్ష రావాలి



15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలి. కానీ, 45 రోజులు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదు. నాకు పాల బిల్లు రూ.లక్ష రావాల్సి ఉంది. త్వరగా బిల్లులు మంజూరు చేయాలి. అలాగే ప్రభుత్వం లీటరుపై 4 రూపాయలు అందిస్తున్న అదనపు ప్రోత్సాహకం మూడేళ్లుగా అందటం లేదు. గత ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తామని చెప్పింది కానీ ఇవ్వలేదు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుని పాడి రైతులను ప్రోత్సాహకం అందించి ఆదుకోవాలి.

రవీందర్‌రెడ్డి, ఎల్కగూడ, జిల్లేడు చౌదరిగూడ మండలం

8

రోడ్డెక్కిన పాడి రైతులు

- బిల్లుల కోసం కడ్తాలలో ఆందోళన
- హైవేపై పాలు పారబోసి నిరసన



కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సర్కారీ వైద్యం పేదలకు దూరం!

- మండల కేంద్రానికి దూరంగా కొత్తూర్ పీహెచ్‌సీ
- మూడు కిలోమీటర్లు వెళ్లలేక ప్రైవేట్ ఆస్పత్రులకు
- నెరవేరని నేతల హామీలు.. ఇబ్బందుల్లో ప్రజలు

కొత్తూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు దూరభారంగా మారింది. 'అంగట్లో అన్నీ ఉన్న.. అల్లుని నోట్లో శని' అనే చందంగా మారింది ఆరోగ్య కేంద్రం పరిస్థితి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్లకు దూరంలో ఆరోగ్య కేంద్రం ఉండడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే బస్సులు, ఆటోల్లో వెళ్లాల్సి వస్తుంది. నడకదారిలో

మిగతా 8వ పేజీలో...

సైబర్ వల...

డబ్బులు ఫట్!

చేవెళ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సైబర్ వలలో చిక్కుకొని ఇద్దరు మోసపోయిన సంఘటనలు మండలంలో చోటు చేసుకున్నాయి. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీలో పవార్ ఆదిత్య అప్పారావు(23) డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 10న అతడి వాట్సాప్‌కు టెలిగ్రామ్‌లో జాయిన్ అవ్వాలని 8266075602 నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. లింక్‌ను క్లిక్ చేయగానే అతని అకౌంట్ నుంచి రూ.80వేలు డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో టీచర్స్ కాలనీలో ఉండే వనజకు ఆమె స్నేహితురాలు ఎల్ఎఫ్ఎల్ యాప్‌లో పెట్టుబడి పెడితే డబుల్ రిటర్న్స్ వస్తాయని చెప్పింది. దీంతో వనజ డిసెంబర్ 8న యాప్‌లో రూ.88,623 డిపాజిట్ చేసింది. జనవరి 3వ తేదీన ఈ మొత్తానికి డబుల్ వస్తుందని చెప్పారు. తీరా సదరు యాప్ నెల రోజులుగా క్లోజ్ అయ్యింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా భూసేకరణలో అవినీతి

- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూసేకరణలో అవినీతి జరిగిందని, బినామీల పేరుతో డబ్బు కాజేయడంపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి, లేదా రిటైర్డ్ న్యాయమూర్తి చేత విచారణ చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ పాలకులు సేకరించిన పేదల భూములు తిరిగిస్తామని కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెప్పారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు పాల్పడడం దారుణమని ధ్వజమెత్తారు. గురువారం యాచారం మండలం మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాచారం మండలంలో 10 వేల ఎకరాలు తీసుకోగా.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ, స్కిల్ యూనివర్సిటీ, ఫోర్త్‌సిటీ పేరిట 30వేల ఎకరాలను సేకరించడానికి పూనుకోవడం దారుణమన్నారు. యాచారం మండలంలో 2,200 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో ఉంచి క్రయవిక్రయాలు జరగకుండా, పంట రుణాలు పొందలేక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు దూరమై రైతులు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఆన్‌లైన్‌లో రైతుల పేరిట నమోదు చేయకపోతే పోరాటం చేస్తామని తేల్చి చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం బినామీలకు పరిహారం శీర్షికన ప్రచురితమైన కథనాన్ని చూసి తాము విస్తుపోయామని.. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, కె.జగన్ తదితరులున్నారు.

కొత్త మున్సిపాలిటీల్లో మరికొన్ని గ్రామాలు?

ప్రతిపాదనలు పంపిన అధికారులు

చేవెళ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పాటైన చేవెళ్ల మున్సిపాలిటీలో మరో నాలుగు గ్రామ పంచాయతీలు, మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామం విలీనానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే ఇప్పటికే 8 గ్రామ పంచాయతీల చొప్పున చేవెళ్ల, మొయినాబాద్‌లను మున్సిపాలిటీలుగా ఏర్పాటయ్యాయి. అయితే గతంలో 12 పంచాయతీలతో చేవెళ్ల మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కాగా చివరకు 8 గ్రామ పంచాయతీలతోనే మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. కాగా ఈ మున్సిపాలిటీలో కొత్తగా మరో నాలుగు గ్రామ పంచాయతీలైన కందవాడ, పలుగుట్ట, మల్లారెడ్డిగూడ, పామెన గ్రామాలను విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామం అప్పోజిగూడను విలీనం చేసే అవకాశం ఉందని సమాచారం. అయితే విలీన గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం నుంచి త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలుస్తుంది. ఈ మేరకు కలెక్టర్ నుంచి మున్సిపల్ శాఖకు ప్రతిపాదనలు అధికారులు పంపినట్లు తెలిసింది.



గిరిజన విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలో గురువారం వివిధ ఆయన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా పటేల్‌చెర్వుతండాలో జరుగుతున్న వీర హనుమాన్ జాతరకు హాజరయ్యారు. అనంతరం ఆరుట్లలో శ్రీవేణుగోపాలుడు రుక్మిణీసత్యభామల కల్యాణ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మంచాలలో నిర్వహించిన గిరిజన విద్యార్థుల సాంస్కృతిక ఉత్సవాల సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ వేడుకలో కేజీబీవీ విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చివరగా మంచాల మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటుచేసిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో క్రోఢీకరించి లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్‌రావు, ఎంపీడీవో బాలశంకర్, మాజీ ఎంపీపీ కె.శ్రీనివాస్‌నాయక్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, మాసయ్యగౌడ్, నాయినంపల్లి యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మార సురేష్, చీమల జంగయ్యయాదవ్, కారింగ్ జంగయ్యగౌడ్, మిద్దె శ్రీనివాస్‌గౌడ్, వెదిరె సికిందర్‌రెడ్డి, మంతని శివ, రాఘవ, బుగ్గరాములు, జిలమోని సత్తయ్య, ఎన్నిదుల సురేష్, గుండెమోని జయమ్మ, గుర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం

- ఏకాగ్రతతో చదువుకోవాలి
- రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి

కందుకూరు,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ చాలా కీలకమని, ప్రతీఒక్కరు చదువుపై ఏకాగ్రత నిలిపి ముందుకు సాగాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని రాచులూరు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వంటకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందన్నారు. పాఠశాలలో స్మార్ట్‌క్లాస్ రూమ్స్ జరుగుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు, మండల విద్యాధికారి హెచ్.నరసింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి



మండుతున్న ఎండ.. కొబ్బరి నీళ్లకు డిమాండ్

ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరిలోనే భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 11గంటలైతే చాలు అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. వేసవి తాపాన్ని తట్టుకోవడానికి చల్లని పానీయాలను తీసుకోవడానికి జనం ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా వేసవిలో కొబ్బరి బొండాలకు భలే గిరాకీ ఉంటుంది. ఇప్పటికే రహదారుల వెంట వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. శరీరానికి చల్లదనం ఇవ్వడంతో పాటు పోషకాలు మెండుగా ఉండే కొబ్బరి బొండాలను తాగడానికి ఆసక్తి చూపుతున్నారు. శంకర్‌పల్లికి వెళ్తే రహదారిలో ఇలా రోడ్డు పక్కన ఆటోలో తెచ్చి కొబ్బరి బొండాలు అమ్ముతున్నారు. అయితే ఆమనగల్లులో కొబ్బరి బొండాల రేటు విపరీతంగా పెరిగింది. స్థానికంగా దిగుమతి తక్కువగా ఉండటంతో బెంగళూరు, కేరళ, కోనసీమ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జి, నాణ్యతను బట్టి ఒక్కో కొబ్బరి బొండా రూ.60 వరకు విక్రయిస్తున్నారు. గత నెల రూ.50 ఉన్న కాయ పది రూపాయలు పెంచి అమ్ముతున్నారు.

- ఆమనగల్లు/ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

కులకచర్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు రాజకీయ నాయకులు సహకరించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో తప్పులుంటే తెలియజేయాలన్నారు. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికలకు ఓటరు జాబితాను విడుదల చేశామన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న కేంద్ర బృందం, స్థానిక అధికారులు

నవోదయ పాఠశాలకు స్థల పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం నవోదయ కేంద్ర బృందం సభ్యుడు, నవోదయ పాఠశాలల నిర్మాణ జనరల్ మేనేజర్ జీవీ.రెడ్డి గురువారం మేడ్చల్ జిల్లా ప్రతాప్‌సింగారంలో స్థల పరిశీలన చేశారు. ప్రతాప్‌సింగారం లోని సర్వే నంబర్ 378లో ఉన్న ప్రభుత్వ భూమిలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు పరిశీలించారు. ఈ భూమిలో ఏమైనా సమస్యలున్నాయా? అనే విషయంపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నవోదయ పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉందని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బృందం వెంట డీఈవో విజయకుమారి, తహసీల్దార్ డీఎస్.రజని, ఆర్ఐ కావ్యరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మాజీ సీఎంను కలిసిన నాయకులు



కేసీఆర్‌తో శుభప్రద్, విజయ్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో ఆయను కలిసి వికారాబాద్ జిల్లా రాజకీయాలపై చర్చించారు. రానున్న రోజులన్నీ బీఆర్ఎస్‌వేనని కేసీఆర్ అన్నారని నాయకులు తెలిపారు.



'జై సేవాలాల్' సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

'జై సేవాలాల్' పాటల సీడీ ఆవిష్కరణ

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టేకులపల్లి పంచాయతీ హామ్లెట్ మక్తతండాకు చెందిన వీరేందర్ బంజారాల దైవం సేవాలాల్ మహరాజ్‌పై పాటలు పాడుతున్నాడు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని అతడు రూపొందించిన పాటల సీడీని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సుదర్శన్, శ్యామ్‌లు గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతిపై రూపొందించిన పాటలు బంజారాల సంస్కృతిని తెలియజెప్పేలా ఉన్నాయని సీడీ రూపకర్తలు, ఆవిష్కర్తలు అన్నారు. కార్యక్రమంలో సింగర్ వీరేందర్, మురళీజాదవ్, ఈశ్వర్, నవీన్, గుండు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయం వద్ద కార్మిక సంఘం నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కరణ్‌కోట ఫ్యాక్టరీ కార్మిక సంఘం ప్రతినిధి పాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శరణప్ప అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సునీల్‌కుమార్‌ను కలిసి కార్మిక సమస్యలపై వివరించారు. ఈ నెల 25వ తేదీలోపు ప్రతీ కార్మికుడికి పెండింగ్‌లోని రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వేతనాలు, డ్రెస్సులు, బూట్లు, హెల్మెట్, దసరా గిఫ్ట్ రూ.2వేలు ఇవ్వాలని కోరారు. వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీసీఐ యాజమాన్యం పెండింగ్ వేతనాలిస్తామని గతంలోనే హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారులతో చర్చల్లో రైల్వే కార్మికులు ఎల్లప్ప, శీను, అనంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ రంగ/సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ కోరికను నెరవేర్చాలని నేటి నుంచి మూడు రోజుల పాటు పట్టణంలో పనులను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. చాలీచాలని కూలితో సెంట్రింగ్ కార్మికుల బతుకు దుర్భరంగా మారిందన్నారు. తమ డిమాండ్‌కు భవన యజమానులు మద్దతివ్వాలని, స్లాబ్ ప్రతీ ఫీట్‌కు రూ.130 చొప్పున ధర చెల్లించాలన్నారు. శుక్రవారం ఉదయం ఆలంపల్లి నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న రంగారెడ్డి ఎక్సైజ్ కమిషనర్ దశరథ్

నాన్‌డ్యూటీ మద్యాన్ని అరికట్టాలి

● సమీక్షలో డిప్యూటీ కమిషనర్ దశరథ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నాన్ డ్యూటీపెయిడ్ మద్యాన్ని అరికడితేనే మద్యం అమ్మకాలు పెరుగుతాయని, అక్రమ మద్యంపై నిఘా పెట్టాలని రంగారెడ్డి ఎక్సైజ్ కమిషనర్ పి.దశరథ్ అన్నారు. గంజాయి, డ్రగ్స్‌తోపాటు నాన్‌డ్యూటీ పెయిడ్ అమ్మకాలను గట్టి నిఘా పెట్టి అరికట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఆబ్కారీ భవన్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ అధికారులతో చర్చించారు. గత నెలలో ఎక్సైజ్ అధికారుల పనితీరును పరిశీలించి మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. డిస్పోజల్ కమిటీ అనుమతితో పలు స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేసి పట్టుబడిన వాహనాలను వేలం వేయాలని సూచించారు. సమావేశంలో డీసీతోపాటు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజ్గిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, ఫయాజుద్దీన్, నవీన్, విజయభాస్కర్, ఏఈఎస్, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు పాల్గొన్నారు.

దైవ సేవకులపై దాడులు సరికాదు



రంగరాజన్‌తో మాట్లాడుతున్న ముజఫర్ అలీ

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నిత్యం భగవంతుని సేవలో ఉండే వారిపై దాడులు మంచి పద్ధతి కాదని, అది ఎవరు చేసినా శిక్షార్హమేనని హైదరాబాద్‌లోని హజ్రత్ షేక్‌జీహలీ దర్గా నిర్వాహకుడు ముజఫర్ అలీ సూఫీ అన్నారు. గురువారం ఆయన చిల్కూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. సంస్కృతి, సంప్రదాయాలను భక్తులకు ఓపికతో వివరించే రంగరాజన్‌పై దాడి దురదృష్టకరమన్నారు. ఇటీవల తాము హైదరాబాద్‌లో నిర్వహించిన సూఫీ బసంత్‌లో రంగరాజన్ పాల్గొని సర్వమతాల సారం సమాజ శాంతే అని అన్నారని గుర్తుచేశారు.



పరామర్శిస్తున్న ఎస్సీ రిజర్వేషన్ సమితి సభ్యులు

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆమనగల్లు: అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఉప్పుల నర్సింహ అన్నారు. బాలాజీ ఆలయంలో రంగరాజన్‌ను నర్సింహ పరామర్శించారు. రామరాజ్యం పేరుతో ఓ వ్యక్తి రంగరాజన్‌పై దాడిని ప్రతొక్కరు ఖండించాలన్నారు. పరామర్శించిన వారిలో బలరామ్, దేవేంద్రప్ప, సుమలత ఉన్నారు.

పన్ను వసూళ్లలో

తాండూరు లాస్ట్!

బల్దియాలో పేరుకుపోయిన ట్యాక్స్‌లు



పన్ను వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది

తాండూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రంలోని 152 మున్సిపాలిటీల్లో తాండూరు లాస్ట్‌లో ఉంది. పన్ను వసూళ్లపై ఆరు నెలలుగా మున్సిపల్ రెవెన్యూ విభాగం పట్టించుకోక, ఉన్నతాధికారి పర్యవేక్షణ లేక ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడ్డారు. ప్రస్తుతం 16శాతం పన్నులే వసూలు చేశారు. మున్సిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 36వార్డుల్లో రూ.13.4కోట్ల ట్యాక్స్ రావాల్సి ఉండగా ఈ నెల 5వ తేదీ వరకు రూ.2.75కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఈ మున్సిపాలిటీలో 8 రెవెన్యూ వార్డులున్నాయి. వచ్చే మార్చి 31 నాటికి రూ.11కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం ఉంది. ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులు, బిల్‌కలెక్టర్లు, జవాన్లతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమొస్తే పాత బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తామని ఎన్నికల్లో నాయకులు హామీ ఇచ్చారని, ఇప్పుడు మిత్తి లేకుండా పన్ను తీసుకోవాలని ఇళ్లకు వెళ్తున్న సిబ్బందిని ప్రజలు కోరుతున్నారు. వడ్డీ మాఫీ చేస్తేనే పన్ను కడతామని అంటున్నారు. మరోవైపు పన్ను కట్టకుంటే రెడ్ నోటీసులిచ్చి ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వసూళ్లను ఖజానాలో జమచేయని జవాన్

ఇదిలా ఉంటే తాండూరు మున్సిపాలిటీలోని ఓ అధికారికి సన్నిహితంగా ఉండే ఓ జవాన్‌కు పన్ను వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. అతడు వ్యాపారుల నుంచి పన్ను డబ్బులు తీసుకొని రశీదు ఇవ్వకుండా స్వాహా చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి. తాము ట్రేడ్ ట్యాక్స్‌ను ఇప్పటికే చెల్లించామని, రిసిప్ట్‌మాత్రం ఇవ్వలేదని ట్యాక్స్ వసూళ్లకు పోతున్న సిబ్బందితో వ్యాపారులు వాపోతున్నారు. బల్దియా డబ్బును సొంతానికి వాడుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



స్థల పరిశీలన చేస్తున్న జైపాల్‌యాదవ్, వెంకటేశ్, దశరథ్, అనురాధపత్య తదితరులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను దగాచేసిందన్నారు. ఆమనగల్లులో ఈ నెల 18న బీఆర్ఎస్ నిర్వహించే రైతు దీక్ష విజయవంతానికి గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిచే రైతుదీక్ష సభాస్థలాన్ని నాయకులు పరిశీలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. కాగా జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు అనురాధపత్యనాయక్, దశరథ్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలు సభాస్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టేందుకు రైతుదీక్ష చేపడుతున్నామని, సభకు నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని జైపాల్ కోరారు. కాంగ్రెస్ సర్కార్ ప్రశ్నించే గొంతులను అణచేస్తోందనిఆరోపించారు. పంటల రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, లచ్చీరామ్, సరితపంతూ, రమేశ్‌నాయక్, బాలస్వామి, డి.వెంకటేశ్, గణేశ్, శివ, సైదులుగౌడ్, సాయిలు, సతీష్, ప్రవీణ్, శివకుమార్, హేమ్లు పాల్గొన్నారు.



నీటి సమస్య పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించిన మహిళలు

తాగునీటి సమస్య తీర్చాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టేకుల్‌కోడ్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గురువారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వారం రోజుల క్రితం ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచింది. ఈ సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి వాటర్‌గ్రిడ్ అధికారులకు తెలిపారు. అయితే మెయిన్ పైప్‌లైన్‌కు రిపేరు చేసినా ఒక కాలనీకి నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ వివరణిస్తూ.. సీసీ రోడ్డు వేసిన సమయంలో పైప్‌లైన్ కొన్నిచోట్ల బ్లాక్ కావడంతో నీరు రావడం లేదన్నారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

మరింత భూసేకరణ సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'ఫార్మా సిటీని రద్దు చేస్తాం. ఇకపై భూసేకరణ చేయం.' అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అదనంగా 30వేల ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం అనుకోవడం సిగ్గుచేటని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. గురువారం మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భూసేకరణలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేదలకు అన్యాయం చేశాయన్నారు. ఏవేవో అవసరాలకు 30వేల ఎకరాలు సేకరించేందుకు యాచారం మండల పరిధి గ్రామాల్లోని అసైన్డ్ భూములపై ప్రభుత్వం కన్నేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాటి మోతబరి రైతులు నేడు కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బాస్, మండల, జిల్లా కమిటీల నాయకులు ఆలంపల్లి నర్సింహ, శ్రీనివాస్, కె.జగన్, జంగయ్య, వినోద్‌కుమార్, విప్లవ్‌కుమార్, వెంకటయ్య, ఐలయ్య పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

చెన్నకేశవాలయంలో పెద్ద రథోత్సవం

కడ్తాల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని ప్రసిద్ధ శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారు జామున స్వామివారి బ్రహ్మ రథోత్సవం(పెద్దతేరు) నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉత్సవ విగ్రహాలతో ఉన్న రథాన్ని లాగి మొక్కు తీర్చుకున్నారు. పర్యవేక్షకులు వెంకటేశ్వరశర్మ, అర్చకులు వేణుగోపాల్, శ్రీధర్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్, నర్సింహమూర్తిల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ శివప్రసాద్, నాయకులు కడారి రామకృష్ణ, జంగారెడ్డి, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, బిక్షపతి, మహేశ్, రాములు, వెంకట్‌రెడ్డి, సత్యం, బుచ్చయ్య, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాల్ ప్రతిభ



ఆమనగల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 పరీక్షలో మేడిగడ్డతండాకు చెందిన వడ్త్యావత్ విశాల్ ప్రతిభ కనబరిచాడు. ఆమనగల్లు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విశాల్ జేఈఈ రాసి ఎన్టీఏ స్కోర్ 83.87 సాధించాడని ప్రిన్సిపాల్ ఆర్.మాధవరావు, ఫిజిక్స్ అధ్యాపకుడు కృష్ణయ్య గురువారం తెలిపారు. విశాల్‌ను, అతడి తల్లిదండ్రులు సరోజ, లక్ష్మణ్‌లను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నాసర్ పోలో గ్రౌండ్‌లో ఈక్వెస్ట్రియన్ క్రీడలు



శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జన్వాడలోని నాసర్ పోలో గ్రౌండ్ ఈక్వెస్ట్రియన్ క్రీడలకు వేదిక కానున్నది. ఈ నెల 22, 23 తేదీల్లో ఈక్వెస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహిస్తామని గురువారం నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడల్లో గుర్రపు స్వారీ, జంపింగ్, పోలో తదితర క్రీడలు ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ గెలిచే వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారన్నారు. ఉత్సాహవంతులైన రైడర్లు పాల్గొనాలని కోరారు.

కరెంట్ బిల్లు రూ.1.41లక్షలు!

● విద్యుత్ కాంట్రాక్టర్ ఇంటి కనెక్షన్ కట్

● సర్వీసు కేటగిరీ మార్చకనే భారీ బిల్లు




రూ.1.41లక్షల బిల్లును చూపుతున్న శివదర్శన్

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రూ.1.41లక్షల కరెంట్ బిల్లు కట్టలేదని అధికారులు కనెక్షన్ కట్ చేసిన ఘటన వికారాబాద్‌లో గురువారం జరిగింది. వికారాబాద్ సాకేత్ నగర్ కాలనీకి చెందిన స్వరూప ఇంటికి మొదట కేటగిరీ-2 కింద మీటర్ బిగించారు. తరువాత దానిని కేటగిరీ 8కి మార్చడంతో కరెంట్ బిల్లు క్రమంగా పెరుగుతూ రూ.1.41లక్షలు వచ్చింది. బిల్లు కట్టలేదని అధికారులు కనెక్షన్ కట్‌చేశారు. దీనిపై స్వరూప భర్త శివదర్శన్ స్పందిస్తూ.. తాను ట్రాన్స్‌కోలోనే కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నానని, విద్యుత్ శాఖలో తన డిపాజిట్ డబ్బు రూ.10లక్షలు ఉన్నాయన్నారు. తాను చేసిన పనులకు రూ.70లక్షల బిల్లు రావాల్సి ఉందని, అధికారులు ఆ బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని, కానీ ఇప్పుడు తన ఇంటి కనెక్షన్ కట్‌చేయడం ఏం న్యాయం ప్రశ్నించారు. తన సర్వీస్‌ను కేటగిరీ 8 నుంచి 2లోకి మార్చాలని 14 నెలల క్రితమే దరఖాస్తు చేసినా పరిష్కరించకుండా లక్షల్లో బిల్లులు వేశారని వాపోయాడు.

రోడ్ల పక్కన పెంచిన మొక్కలకు నిప్పు



కాలిపోయిన మొక్కలు




యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దుండగుల నిర్వాకంతో ఏపుగా పెరిగిన మొక్కలు కాలిపోయాయి. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న గడ్డికి నిప్పటించడంతో చిన్నతూండ్లలో 10 మొక్కలు కాలిపోయాయి, మొక్కలు ఏపుగా పెరిగాయి. పంచాయతీ సిబ్బంది నీరు పోసేవారు. దుండగులు నిప్పటించడంతో మొక్కలన్నీ కాలిపోయాయి. నాగార్జున సాగర్-హైదరాబాద్ రహదారిపై నీరిచ్‌మోడ్ హోటల్ సమీపంలో బుధవారం రాత్రి దుండగులు నిప్పటించడంతో 15చెట్లు కాలిపోయాయి. తమ్మలోనిగూడ పంచాయతీ సిబ్బంది వారం వారం చెట్లకు నీరుపెట్టి పెంచారు. దుండగుల చర్యలతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీపల్లిలో అంతా బీసీలే!



పంచాయతీ కార్యాలయం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఊరు అంటే అన్ని కులాలు, మతాల ప్రజలుంటారు. కానీ అక్కడ మాత్రం అందరూ బీసీ కులస్థులే ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓసీ, మైనార్టీలు ఎవరూ లేని గ్రామంగా లక్ష్మీపల్లి ప్రత్యేకతను సంతరించుకొంది. కొడంగల్ మండలం లక్ష్మీపల్లిలో 250 కుటుంబాలున్నాయి. 240 ముదిరాజ్, 10 కురవ కుటుంబాలున్నాయి. వెయ్యి మంది జనాభా, 600 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామ జనాభా మొత్తం బీసీలే! ఇది గతంలో పక్క గ్రామం సంగాయిపల్లితో పంచాయతీగా ఉండేది. కొన్నేళ్ల కిందనే పంచాయతీగా ఏర్పాటైంది. కాగా గ్రామస్థుల వ్యవసాయంపై ఆధారపడ్డారు. కూరగాయలు పండించి సమీప గ్రామాల్లో అమ్ముతుంటారు. చాకలి, మంగళి, కమ్మరి తదితర కులవృత్తుల వారు పక్క గ్రామం అంగడి రాయచూర్ నుంచి వచ్చి పనులు చేస్తారు. ఈ గ్రామంలో అందరూ బీసీలే కాబట్టి అన్ని కులాలకూ రాజకీయ పదవులు అవకాశం లభించే అవకాశం ఉంది.



లక్ష్మీపల్లి గ్రామ వ్యూ

అన్ని వర్గాలకు సమన్యాయం : కసిరెడ్డి


న్యామతాపూర్‌లో చెంచులకు బోరు మోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చెంచుల ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. మండలంలోని న్యామతాపూర్‌లో గురువారం చెంచు రైతులకు బోరు మోటర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీటీడీవో రామేశ్వరి దేవి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవ రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లతో కలిసి చెంచులకు ఎమ్మెల్యే బోరు మోటర్లు అందజేశారు. ముక్తమాదారం, రావిచెడ్, సాలార్‌పూర్‌లో రూ.50లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. న్యామతాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీ ఉత్పత్తుల ద్వారా చెంచుల ఆదాయ వనరులు పెంచి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, అజీం, నాయకులు బాల్‌రాజ్, షాబోద్దీన్, ఇమ్రాన్‌బాబా, సుమన్, రవి, డిగ్రీ కృష్ణ, నర్సింహగౌడ్, నారాయణ, యాదయ్య, రామలింగం, ఆనంద్, మహేశ్, వెంకటయ్య, రాంరెడ్డి, విఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : వీర్లపల్లి


కొందుర్గులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండలంలో రూ.2కోట్ల.17లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులు రూ.20లక్షలు, అంగన్వాడీ భవనం రూ. 12 లక్షలు, రేగడి చిలకమర్రిలో సీసీ రోడ్డు రూ.26లక్షలు, జీపీ భవన నిర్మాణం రూ.20లక్షలు, ముట్పూర్‌లో సీసీ రోడ్డు రూ.13లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ రూ.5 లక్షలు, ఉత్తరాస్‌పల్లిలో సీసీ రోడ్డు రూ.6లక్షలు, చిన్న ఎల్కిచర్లలో కల్వర్టు నిర్మాణానికి రూ.50లక్షలు, సీసీ రోడ్డు రూ. 15 లక్షలు, గంగన్నగూడలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.50 లక్షలతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు అని, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సయ్యద్ సాధిక్, పురుషోత్తంరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, రాములుగౌడ్, నరేందర్, జీబీ కృష్ణ, కృష్ణయ్య, కేకే కృష్ణ, వేణుగోపాల్ తదితరులున్నారు.

ఘనంగా వీరహనుమాన్ ఉత్సవాలు


మంచాల : ఆరుట్లలో నిర్వహించిన వేణుగోపాలస్వామి రథోత్సవంలో భక్తులు

మంచాల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పటేల్‌చెర్వుతండాలో యాపరాళ్ల శ్రీ వీరహనుమాన్ జాతర వైభవంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు యువతీయువకులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నేత దండెం రాంరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆరుట్లలో శ్రీ వేణుగోపాల స్వామి రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ రథోత్సవంలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన అలరించాయి. మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీల నేతలు, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఈశ్వర్‌కాలనీ ఈశ్వరాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఐదవ వార్షికోత్సవం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మేడిగ పెంటయ్య ఆధ్వర్యంలో కాశీ విశ్వేశ్వరుని ప్రతిరూపమైన మహా శివలింగానికి శాస్త్రయుక్తంగా అభిషేకం చేశారు. అంజనేయస్వామికి, నవగ్రహాలకు, నాగులకు అభిషేకాలు చేసి, పూజ చేశారు. అనంతరం హోమం నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పూజారి మనికంఠ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, కాలనీవాసులున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కేశంపేట : పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి శివారు గుట్టపై వెలిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హాజరైనారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథులను శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు వృషభ ప్రతిమలను అందించారు. మాజీ జడ్పీటీసీలు విశాలశ్రవణ్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు కళమ్మ, అశోక్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బండ మల్లేష్, చంద్రయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వర్, పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలీశ్వర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్, ఎ.రమేష్, భాస్కర్‌గౌడ్, బీస కరుణాకర్ రెడ్డి, పర్వతాలు, రాములు, తదితరులున్నారు.

నేటి నుంచి దవళగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కేశంపేట మండల కేంద్రంలోని దవళగిరి గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు శుక్రవారం పంచామృతాభిషేకం, రాత్రికి అంకురార్పణం తదితర కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా 19న చక్ర తీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయన్నారు.

మైసిగండి మైసమ్మను సందర్శించుకున్న సినీహీరో విశ్వక్‌సేన్


కడ్తాల్ : మైసమ్మను దర్శించుకుంటున్న సినీనటుడు విశ్వక్‌సేన్

కడ్తాల్ : ప్రముఖ సినీనటుడు విశ్వక్‌సేన్ గురువారం కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సందర్శించారు. తాను నటించిన లైలా చిత్రం శుక్రవారం విడుదల నేపథ్యంలో కుటుంబ సభ్యులు, చిత్రయూనిట్‌తో కలిసి మైసమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీపంతు, ఈవో స్నేహలత ఆలయ మర్యాదలతో సత్కరించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చీకటి వేంకటేశ్వరాలయంలో..

కందుకూరు : మండలంలోని పులిమామిడిలో గల చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 10న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. పీసీసీ సభ్యుడు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, నాయకులు కృష్ణానాయక్, వి.రఘుపతి, ఎండీ అఫ్జల్‌బేగ్, బుక్క పాండురంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, నారాయణ, పి.యాదయ్య, ఎ.భిక్షపతి, డిల్లీ శ్రీధర్, జగదీష్, ఎం.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెను ప్రమాదకరంగా మారిందని, వీలైనంత వరకు దాని వాడకాన్ని తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ యోగేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి గురువారం దుకాణదారులు, కూరగాయల వ్యాపారస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రమాదకరమైన ప్లాస్టిక్ అమ్మకం, వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుందని, 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు కవర్లు, బ్యాగులు, ప్యాకింగ్ కవర్లు ఉపయోగించరాదని తెలిపారు. ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు అమ్మినా, వినియోగించిన వారికి భారీ జరిమానాలతో పాటుగా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వ్యాపారస్తులు, వినియోగదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇష్టం వచ్చినట్లు దుకాణాల ముందు వాహనాలను నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నదని అన్నారు. మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, పర్యావరణ ఇంజనీర్ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి


మొండిగౌరెల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): హరితహారం నర్సరీల్లో ఎట్టి పరిస్థితుల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం మొండిగౌరెల్లిలో నర్సరీని తనిఖీ చేశారు. వానాకాలంలో ప్రతీ గ్రామంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని గ్రామస్తులకు సూచించారు. ఇప్పటి వరకు నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరు పెట్టి కాపాడాలని పంచాయతీ అధికారులను ఆయన ఆదేశించారు.

ఎన్నికలు పక్కాగా నిర్వహిద్దాం

కేశంపేట/యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పక్కాగా నిర్వహించుకుందామని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు తెలిపేందుకు రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముసాయిదా పోలింగ్ కేంద్రాలను సిద్ధ చేశామని యాచారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి చెప్పారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిల పక్ష నాయకుల సమావేశంలో మాట్లాడారు.

క్రైం కార్నర్

మహిళపై దాడి.. ఆపై ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

- వివాహేతర సంబంధమే కారణం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసిన ఓ యువకుడు ఆపై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ కేంద్రంలోని ఓఆర్ఆర్ పక్కనున్న డీటీడీసీ కొరియర్ వెనకాల గల రాజీవ్ గృహకల్పలో నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లికి చెందిన వరలక్ష్మి(25) కొన్నేళ్లుగా నివాసముంటోంది. కొన్ని రోజుల క్రితం వరలక్ష్మి భర్త మృతి చెందాడు. ఏపీలోని కదిరికి చెందిన మన్సూర్(23) వారి ఇంటి పక్కనే నివాసముంటున్నాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య అక్రమ సంబంధం మొదలైంది. కొన్ని రోజుల తర్వాత మనస్పర్ధలు రావడంతో వరలక్ష్మి వారి తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. గురువారం రూమ్ ఖాళీ చేద్దామని వచ్చిన ఆమెతో మన్సూర్ గొడవ పడ్డాడు. దాంతో కోపొద్రిక్తుడైన మన్సూర్ బండరాయితో వరలక్ష్మి తలపై బలంగా కొట్టాడు. తలకు తీవ్ర గాయాలై రక్తపు మడుగులో ఉన్న వరలక్ష్మి మృతి చెందిందని భావించిన మన్సూర్ తన రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన వరలక్ష్మి తండ్రి తన కూతురుని పోలీసుల సహాయంతో ఉస్మానియాకు తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మన్సూర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వరలక్ష్మికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భర్త మృతి చెందడంతో కొంత కాలంగా ఇద్దరి మధ్య అక్రమ సంబంధం కొనసాగుతోందని, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషయంగా ఉందని డాక్టర్లు తెలిపినట్లు పోలీసులు చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కాముని చెరువు బ్యాక్‌వాటర్ వద్ద గుర్తుతెలియని శవం(55) ఉందని ఈనెల 10న డయల్ 100కు కాల్ రాగానే.. పెట్రోల్ మొబైల్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ టి.యాదయ్య, హోంగార్డు బాలాజీలు కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ మగ వ్యక్తి శవం ఉన్నట్లు గుర్తించి పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుడి ఒంటిపై నల్లని ప్యాంట్, చెక్స్ షర్ట్ ధరించి ఉందని, శవం గుర్తుపట్టలేనంతగా ఉందని చెప్పారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసినవారు ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఎస్సై మహ్మద్ అర్షద్ అలీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆభరణాల కోసమే హత్య

- సత్యమ్మ డెత్ కేసులో వెలుగులోకి..
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి గుర్తింపు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు.. రిమాండ్‌కు తరలింపు

షాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆభరణాల కోసం మహిళను హత్యచేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. షాబాద్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి హత్యకు గల కారణాలను వెల్లడించారు. మండల పరిధిలోని మన్‌మర్రికి చెందిన జట్టని సత్యమ్మ (65) ఇటీవల హత్యగావింపబడ్డ విషయం తెలిసిందే. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లికి చెందిన వత్యావత్ అనిల్‌కుమార్.. తల్లి దండ్రులు చనిపోవడంతో తన అమ్మమ్మ ఊరైన కొందుర్గు మండలం కాస్లాబాద్ తండాలో ఇల్లు కట్టుకొని అక్కడే నివసిస్తున్నాడు. రెండు బొలెరో వాహనాల్లో పీడీఎస్ బియ్యం సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుపడడంతో అతడిపై కేసు నమోదైంది. వాహనాలు లేక జీవనోపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈనెల 8న అనిల్‌కుమార్ తన కారులో షాద్‌నగర్ వైపు వస్తుండగా మార్గమధ్యలో అప్పారెడ్డిగూడకు చెందిన టీబీ, జట్టని సత్యమ్మలు లింగారెడ్డిగూడ బస్ స్టాప్ వద్ద కారు లిఫ్ట్ అడిగి ఎక్కారు. మార్గమధ్యలోని మొగిలిగిద్ద వద్ద టీబీ కారు దిగిపోయింది. షాద్‌నగర్ కంటి ఆసుపత్రి వెళుతున్న సత్యమ్మ కారులో అలాగే వెళ్లింది. ఈక్రమంలో ఒంటిపై ఉన్న ఆభరణాలను చూసి అనిల్‌కుమార్ ఎలాగైనా వాటిని అపహరించాలని అనుకున్నాడు. రంగంపల్లి బస్‌స్టాప్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకువెళ్లి నగలు ఇవ్వమని సత్యమ్మను కారులోనే ఆమెపై దాడి చేశాడు. స్పృహ కోల్పోయిన సత్యమ్మను ముళ్ల పొదల్లోకి తీసుకువెళ్లి రాయితో తలపై కొట్టి చంపాడు. మృతి చెందిందని తెలుసుకున్న తర్వాత ఒంటిపై ఉన్న అరకిలో వెండి ఆభరణాలు, 5తులాల బంగారం తీసుకొని ఉడాయించాడు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి కారు నెంబర్ ఆధారంతో నిందితుడిని పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకొని విచారించగా ఆభరణాల కోసం హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితున్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాగా, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ నా యుడు, ఎస్సై సతీష్‌కుమార్, పోలీస్ ఇబ్బంది ఉన్నారు.

కన్నతండ్రిని కడతేర్చిన కుమారుడికి జీవితఖైదు

షాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దన్నందుకు కన్న తండ్రిని కొట్టిచంపిన కొడుకుకు జీవిత ఖైదు శిక్ష పడింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన బోకుల వెంకటేష్‌ను మద్యం తాగొద్దని తండ్రి రామయ్య మందలించాడు. దాంతో తండ్రిపై కక్ష పెంచుకున్న వెంకటేష్ 4-11-2022న కర్రతో కొట్టి చంపాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. వెంకటేష్‌పై నేరం రుజువు కావడంతో ఎల్బీనగర్ కోర్టు న్యాయమూర్తి కవిత నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

కేశంపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలోని అల్వాల రోడ్డులో చోటుచేసుకుంది. 108 అంబులెన్స్ ఈఎంటీ రామచంద్రయ్య, పైలెట్ గణేష్ కథనం మేరకు.. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన చెవిటి ప్రవీణ్(30) షాద్‌నగర్ సిటీకేబుల్, నెట్‌వర్క్‌లో పనిచేస్తున్నాడు. గురువారం విధుల్లో భాగంగా కేశంపేట మండల కేంద్రంలోని అల్వాల రోడ్డులో విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లను వేస్తుండగా చేతులకు కరెంట్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. శరీరం చాలా వరకు కాలిపోయి, పై చర్మం ఊడిపోయింది. 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు రెఫర్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

చేవెళ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు.. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. రోజు మాదిరిగానే ఈ నెల 12న జాబ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి సాయంత్రం వచ్చాడు. రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారే సమయానికి కృష్ణ భార్య పల్లవి(21) కన్పించలేదు. దాంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను గందరగోళానికి గురిచేయొద్దు

- మాజీ వైస్ ఎంపీపీ నర్సింహా యాదవ్

కేశంపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురి చేయవద్దని కేశంపేట మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహ యాదవ్ ప్రకటనలో కోరారు. ప్రజా పాలనలో ప్రభుత్వం ఇదివరకే ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుందని, ప్రజా పాలనలో రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్నా.. మరోసారి ఎందుకు దరఖాస్తు చేసుకోవాలో అధికారుల తెలపాలన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి మీసేవా కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు గ్రామాల్లో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆయన పేర్కొన్నారు.

సర్కారీ వైద్యం.. పేదలకు దూరం!

(5వ పేజీ తరువాయి)

వెళ్లాలంటే దాదాపు గంట సమయం పడుతుంది. తండా వద్ద రెక్వెస్ట్ స్టాప్ ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలు పీహెచ్‌సీకి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీని కొత్తూర్ మండల కేంద్రానికి మారుస్తామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నీటిమీది రాతలుగా మారాయి. దాదాపు 15ఏళ్ల క్రితం మండల పరిధిలోని చాకలిదానిగుట్టతండా సమీపంలో కొత్తూర్ పీహెచ్‌సీని నిర్మించారు. మండలాల పునర్విభజనలో భాగంగా చాకలిదానిగుట్టతండా నందిగామ మండల పరిధిలోకి వెళ్లిపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీని మండల కేంద్రానికి మార్చేందుకు జేపీ దర్గా రోడ్డులోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. కానీ అది కాగితాలకే పరిమితమైంది. ఇదిలా ఉండగా మండల కేంద్రమైన కొత్తూర్ మున్సిపాలిటీగా మారి నాలుగేళ్లు కావొస్తున్నా నేటి వరకు కూడ బస్తీ దవాఖానా కూడ మంజూరు కాలేదు. రాష్ట్ర రాజధానికి, అంతర్జాతీయ విమానాశ్రయానికి అతిచేరువలో ఉన్న కొత్తూర్ మండల కేంద్రంలో ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఆరోగ్య కేంద్రం ప్రజలకు అందుబాటులో లేకుండా పోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులు విచ్చలవిడిగా వెలిశాయి. ప్రజల అవసరాలను అదునుగా చేసుకుని ప్రైవేట్ యాజమాన్యాలు అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పీహెచ్‌సీని కొత్తూర్ తరలించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో తీసుకురావాలి



కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. మండల కేంద్రానికి ఆరోగ్య కేంద్రం దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, నిరుపేదలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి.

కె.శివచారి, బీఆర్ఎస్ యువ నాయకుడు, కొత్తూర్

గర్భిణులకు ఇబ్బందులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. చాకలిదానిగుట్టతండా వద్ద ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. నడక దారిన వెళ్లాలంటే అవస్థ పడాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని కొత్తూర్‌కు తరలించాలి.

- వేదవతి, నాని మహిళా స్వచ్ఛంద సేవా సంస్థ, కొత్తూర్

సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం


అంజయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న తండావాసులు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గిరిజనులు, ఆదివాసీల చైతన్యం కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషి చేశారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తండాలో నూతనంగా నిర్మించిన సంత్ సేవాలాల్ ఆలయాన్ని గురువారం సందర్శించారు. ఆయన్ను తండావాసులు సన్మానించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, నాయకులు వీరేశం గుప్త, శంకర్ తదితరులు ఉన్నారు.

15న సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలు

తలకొండపల్లి : తలకొండపల్లి జంక్షన్ వద్ద 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గిరిజన నాయకులు తెలిపారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. గురువారం జయంతి వేడుకలకు సంబంధించి ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే నారాయణరెడ్డికి హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి అందజేశారు. గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, దేవులా నాయక్, రమేశ్‌నాయక్, పాండు, కొర్ర కృష్ణ, మాన్యనాయక్ తదితరులున్నారు.

ఎంపీ అరుణమ్మకు రుణపడి ఉంటాం


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌నాయక్

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జాతీయ పండుగగా గుర్తించాలని పార్లమెంట్‌లో కోరిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మకు తాము రుణపడి ఉంటామని షాద్‌నగర్ బీజేపీ గిరిజన మోర్చా నాయకులు మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్‌లు తెలిపారు. షాద్‌నగర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇన్నాళ్లు గిరిజనులను ఓటుబ్యాంక్‌గా వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ ఏనాడూ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇస్నాతి శ్రీనివాస్, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అత్తాపూర్ మహేందర్‌రెడ్డి, గోవింద్‌నాయక్, సురేష్‌నాయక్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపసోపాలు!

(5వ పేజీ తరువాయి)

రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టినా, వాటికి నిధులు సకాలంలో విడుదల కాకపోవడతో ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా వ్యవసాయ అనుబంధమైన పాడి రైతులు నష్టాల పాలవుతున్నారు. ఒక వైపు పెరుగుతున్న ధరలతో పశుపోషణ మోయలేని భారంగా మారింది. జిల్లాలో 14 పాల శీతలీకరణ కేంద్రాలు, చిన్న తరహా పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 13,100 లీటర్ల పాల నిలువ సామర్థ్యం ఉండగా, 309 పాల సేకరణ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం 83,856 లీటర్ల పాలను సేకరిస్తున్నారు.

వెన్న శాతాన్ని బట్టి ధర..

రైతులకు వెన్న శాతాన్ని బట్టి ధర నిర్ణయించారు. కనిష్టంగా 5 శాతం వెన్న ఉన్న గేదె పాల ధర లీటర్‌కు రూ.40.05 చెల్లిస్తున్నారు. గరిష్టంగా 10 శాతం ఉంటే రూ.80.10 చెల్లిస్తున్నారు. అలాగే ఆవు పాలకు కనిష్టంగా 3 శాతం వెన్న ఉంటే రూ.40.25 చెల్లిస్తున్నారు. గరిష్టంగా 4.9 శాతం ఉంటే లీటరుకు రూ.46.90 చెల్లిస్తున్నారు. 15 రోజులకోసారి పాల బిల్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే 45 రోజులుగా బిల్లులు రావడం లేదు. కొన్నిచోట్ల పాల కేంద్ర నిర్వాహకుడు చేతి నుంచి రైతులకు డబ్బులు చెల్లిస్తున్నాడు. మిగతా చోట్ల రైతులు పాల బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు.

అందని నగదు ప్రోత్సాహకం

రైతులు పాడి పోషణపై దృష్టి సారించాలనే ఉద్దేశంలో గత ప్రభుత్వం పాల ధరలను పెంచింది. సహకార సంస్థల్లో పాలను విక్రయించి రైతులకు లీటరు పాలకు రూ.4 చొప్పున నగదు ప్రోత్సాహాన్ని ప్రకటించింది. దీంతో పలువురు రైతులు, నిరుద్యోగ యువత పాడి పరిశ్రమపై దృష్టి సారించి పాడి ఆవులు, గేదెలను పోషిస్తూ ఉపాధి పొందుతున్నారు. రైతులకు లీటరు పాలకు అదనంగా చెల్లిస్తామని చెప్పిన ప్రోత్సాహక నగదు 2020 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం చెల్లించడం లేదు. ప్రోత్సాక నగదు అందక పాడి రైతులు ఇక్కట్లు పడుతున్నారు. పెరుగుతున్న ధరలతో పాడి పోషణ భారంగా మారి పశువులను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పథకాలపై అవగాహన కరువు

విజయ డెయిరీ సొసైటీల్లో సభ్యులైన పాడి రైతుల కుటుంబాల్లో ఆడపిల్లల వివాహమైతే పెళ్లి కానుకగా రూ.5 వేలు, పాడి రైతు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.5 వేలు అందజేస్తారు. గేదెల పంపిణీ, రాయితీలో దాణా, గడ్డి విత్తనాలు, మినరల్ మిక్చర్, కాల్షియం పంపిణీ చేస్తున్నా.. అవగాహన లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలో పాల సేకరణ, నిలువ సామర్థ్యం వివరాలు

పాల శీతలీకరణ కేంద్రాలు	పాల నిలువ సామర్థ్యం(లీటర్లు)	పాల సేకరణ కేంద్రాలు	పాల సేకరణ (లీటర్లు)
కడ్తాల్	40 వేలు	51	22,007
షాద్‌నగర్	32 వేలు	65	13,150
చల్లంపల్లి	5 వేలు	18	7,170
చందనధన	5 వేలు	17	5,111
మాడ్గుల	5 వేలు	27	6,750
మన్నెగూడ	వేయి	02	534
జైతవరం	వేయి	02	2,444
కొందుర్గు	8 వేలు	47	8,190
కేశంపేట	5 వేలు	10	2,350
ఎక్లాస్‌ఖాన్‌పేట్	3 వేలు	07	1,600
పిట్టలగూడ	వేయి	04	2,450
షాబాద్	5 వేలు	13	2,400
వికారాబాద్	10 వేలు	29	4,600
పాలమాకుల	10 వేలు	17	5,100

రోడ్డెక్కిన పాడి రైతులు

- బిల్లుల కోసం కడ్తాలలో ఆందోళన
- హైవేపై పాలు పారబోసి నిరసన

కడ్తాల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాల బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ విజయ పాడి రైతులు రోడ్డెక్కారు. ఐదు పక్షాల పాల బిల్లులు రాకపోవడంపై ఆగ్రహించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ కడ్తాలలో గురువారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పాడి రైతులు, పాలసేకరణ కేంద్రాల అధ్యక్షులు ఆందోళనలో పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. పాడి రైతుల ఆందోళనకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై పాలు పారబోసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో 4 వేల మంది రైతులకు సంబంధించి రూ. 17 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. పెండింగ్ పాల బిల్లులు వెంటనే విడుదల చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని జైపాల్ యాదవ్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, దోనాదుల మహేశ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.